

# చదువు

నైపుణ్య

ఈనాడు

హైదరాబాద్

మంగళవారం, డిసెంబరు 5, 2017

మా చిరునామా: చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

10

edc@eenadu.net


**ప్రణాళిక అంటే భవిష్యత్తు నిర్మాణమే...**

ప్రణాళిక అంటే భవిష్యత్తును వర్తమానంలోకి తెచ్చుకోవడమే. అలా చేస్తే నీ భవిష్యత్తును నువ్వే నిర్మించుకోవచ్చు. నిర్దిష్ట ప్రణాళికతో కూడిన స్పష్టమైన లక్ష్యం అద్భుతమైన ఆత్మవిశ్వాసాన్నీ, బలాన్నీ ఇస్తుంది.

– చాణక్యుడు



స్టడీ స్కిల్స్

# ప్లాన్ పక్కా.. మార్కులు ఎంచక్కా!



**పరీక్షల వేడి ప్రారంభమైంది. ఇంటర్, ఇంజినీరింగ్, జేఈఈ, నీట్, ఎంసెట్... ఇలా ఎన్నో. విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతోంది. వినయ్ పుస్తకం వదలడు. ఎప్పుడూ చదువుతూనే ఉంటాడు. విజయ్ పుస్తకం ముట్టడు. ఆటల్లోనే కనిపిస్తాడు. కానీ ఇద్దరికీ మార్కులు ఒకే రకంగా వస్తుంటాయి. ఒక్కోసారి విజయ్‌దే పైచేయి అవుతుంది కూడా. ఎందుకంటే విజయ్ ఒక ప్లాన్ ప్రకారం అన్నీ చేస్తాడు. ఆటలకు, వారాంత కాలక్షేపాలకు కూడా టైం కేటాయిస్తాడు. వినయ్ ఎలాంటి ప్రణాళిక లేకుండా ఎప్పుడూ చదువే అంటాడు. చదవడమూ ఒక నైపుణ్యమే. పక్కాప్లాన్‌తో చేస్తే పర్‌ఫెక్ట్‌గా టార్గెట్ హిట్ అంటున్నారు నిపుణులు.**

వినయ్, విజయ్‌లకు తెలివితేటల్లో తేడా లేకపోయినా చదువుకు సంబంధించిన లక్ష్యసాధనలో తేడా వస్తోందంటే ముఖ్య కారణం - వారి పని తీరు.

విజేతలను సామాన్యుల నుంచి వేరు చేసే ముఖ్యలక్షణాల్లో ప్రణాళిక ఒకటి. ప్రణాళికకు ముందు లక్ష్య స్పష్టత, బలాబలాలపై సరైన అంచనా, ప్రణాళిక అమలులో క్రమశిక్షణ, సానుకూల దృక్పథం, అడ్డంకులు ఎదురైనప్పుడు ప్రయత్నం ఆపని పట్టుదల కావాలి.



డా. టి.ఎస్.రావు
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

'If you are failed to plan, then you are planning to fail' అనే నానుడి వినేవుంటారు. చదువు బుద్ధికీ, మనసుకూ సంబంధించిన పని కాబట్టి, దానిలో ఫలితాల సాధనకు ప్రణాళికే ప్రాణం. దాని అమల్లో విఫలమైనంత మాత్రాన ప్రణాళిక వేసుకోవడం మానకూడదు. అసలు ప్రణాళికే లేకపోవడం కన్నా విఫలమైన ప్రణాళిక మేలు!

ప్రణాళిక అంటే చేయబోయే పనులను ముందుగానే ఊహించుకుని వాటిని ఎప్పుడు, ఎలా చేయాలో నిర్ణయించుకోవడం. బుద్ధిజీవులకు ప్రణాళిక సహజమైన సంగతి. ఏ పని చేయాలన్నా కొద్దో గొప్పో ముందుగా మనసులో ఊహించుకోకుండా చేయడం ఎవరికీ సాధ్యం కాదు. అయితే ఎంత ముందుగా, ఎంత సమగ్రంగా ఊహిస్తావు? అనే విషయాల్లోనే తేడా వస్తుంది. అందుకే - Every house is built twice అన్నారు.

ముందస్తు ప్రణాళిక వల్ల చివరి నిమిషంలో ఉత్కంఠ, ఆందోళన తప్పుతాయి. ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోగలుగుతారు. ఈమధ్య ఎన్నో కళాశాలల్లో ప్రణాళిక ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రణాళికబద్ధంగా చదివించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయినా చాలా చోట్ల అనుకున్న ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా ఆఖరి నిమిషంలో ఉత్కంఠ, ఆందోళన, దానివల్ల వచ్చే ఒత్తిడి, ఆత్మవిశ్వాస లోపం, వాటి దుష్ఫలితాలు అలాగే ఉండిపోతున్నాయి. కారణం ఏమిటి?

## ఆచరణీయమైన లక్ష్యం

ప్రణాళిక వేసుకొనే ముందు విద్యార్థికి లక్ష్య స్పష్టత ఉండాలి. తాను ఏ పరీక్షలో ఎన్ని మార్కులు తెచ్చుకోవాలని అనుకుంటున్నాడో ఆచరణీయమైన లక్ష్యం నిర్ణయించుకోవాలి. విద్యార్థి తన మనసులో 80% చాల్లే అనుకుని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం 90 శాతానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రకటిస్తే ప్రణాళిక విఫలమవుతుంది.

లక్ష్య స్పష్టత తర్వాత, బలాబలాల విశ్లేషణ కూడా ముఖ్యమే. ఏ సబ్జెక్టులో, ఏ ఛాప్టర్లో, ఎలాంటి ప్రశ్నల్లో బలంగా ఉన్నదీ, వేటిల్లో బలహీనంగా ఉన్నదీ విశ్లేషించుకోవాలి. లక్ష్యానికీ, ఆచరణకూ మధ్య తలెత్తే అడ్డంకులు, ప్రయత్నం లేకుండానే ప్రయోజనాన్ని కలిగించే అవకాశాల గురించీ ఆలోచించుకోవాలి.

మంచి ప్రణాళిక ఎలా ఉంటుంది? అది బలాల నుంచి అత్యధిక ప్రయోజనాన్ని పొందేదిగా, బలహీనతల వల్ల అతి తక్కువ నష్టం కలిగించేదిగా, రాబోయే అవకాశాలను గుర్తించి వినియోగించుకునే వీలు కలిగిందిగా, అవరోధాలను బాగా తగ్గించేదిగా ఉంటుంది.

సమష్టి ప్రణాళికలకు అవసరమైన సమయం, దానివల్ల తాను పొందే ప్రయోజనాలను సరిగా అంచనా వేసుకోవాలి. ఏవైనా సందేహాలుంటే అడిగి తెలుసుకోవాలి. వ్యక్తిగతంగా సాధించాల్సిన అదనపు ప్రయోజనాలకు మిగిలిన సమయంలో ప్రణాళిక వేసుకోవాలి. చిన్న చిన్న లక్ష్యాలను పెట్టుకొని, అవి సాధించడానికి అవసరమయ్యే సమయం, ప్రయత్నం మీద నిర్దిష్ట అంచనాకు రావాలి. వ్యక్తిగత ప్రణాళికకూ, తరగతి సామూహిక ప్రణాళికకూ మధ్య సమన్వయం లేనప్పుడు ప్రణాళిక కాగితాలకు మాత్రమే పరిమితమైపోయే అవకాశాలే ఎక్కువ.

సిలబస్, పశ్నపత్రం నమూనాల మీద పూర్తి అవగాహన కూడా ప్రణాళికకు ఉపకరిస్తుంది. సిలబస్‌లో వివిధ పాఠ్యాంశాలకు దక్కిన ప్రాధాన్యాన్ని (వెయిటేజీ) తెలుసుకోవడమూ ముఖ్యమే.

## నెలలవారీ విభజన



ఏడాది చివరి పరీక్షల్లో సాధించాల్సిన లక్ష్యాలను నెలవారీగా విభజించుకోవడంతో చదువుకు సంబంధించిన ప్రణాళిక మొదలవుతుంది. సంవత్సర పరీక్షలకు పది నెలల సమయం ఉండగా అయిదు నెలల్లో 100% సిలబస్ పూర్తిచేసి, తర్వాతి అయిదు నెలలు పునశ్చరణకు కేటాయించడం ఇప్పుడు చాలామంది అనుసరిస్తున్న పద్ధతి. కానీ అది అంత శాస్త్రీయం కాదు.

దీర్ఘకాలిక ప్రణాళికలో కొత్తపాఠాలు నేర్చుకోవడం, పాతపాఠాలను పునశ్చరణ చేసుకోవడం సమపాళ్లలో ఉండాలి. సంవత్సరం మొదట్లో కొత్తపాఠాలు చదివేందుకు ఎక్కువ సమయాన్ని, పునశ్చరణకు తక్కువ సమయాన్ని కేటాయించుకోవాలి. పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ కొత్త పాఠ్యాంశాలకు తక్కువ సమయాన్నీ, పునశ్చరణకు ఎక్కువ సమయాన్నీ కేటాయించుకోవాలి.

నెలలో మూడు వారాలు కొత్తపాఠాలకు (రాని పాఠాలు నేర్చుకొనేందుకు), ఆఖరి వారం పునశ్చరణకు నిర్దేశించుకోవాలి. వారంలో మొదటి అయిదు రోజులు కొత్తపాఠాలకూ, ఆఖరి రెండు రోజులు పునశ్చరణకూ కేటాయించుకోవాలి. రోజులో రాత్రి ఆఖరి గంట, మర్నాటి ఉదయం మొదటి గంట పునశ్చరణకు కేటాయించుకోవాలి. ఇది శాస్త్రీయమైన పద్ధతి.

## రెండంచెల ప్రణాళిక

సిలబస్‌ను నెలవారీ లక్ష్యాలుగా విభజించుకున్న తర్వాత రెండు అంచెల్లో ప్రణాళికను చేసుకోవాలి.

మొదటి అంచె సమయ ప్రణాళిక. రోజు మొత్తంలో చదువుకు కేటాయించే సమయం, అందులో విద్యార్థి చేతుల్లో లేకుండా అధ్యాపకులు చెప్పినట్లు చేసేందుకు కేటాయించాల్సిన సమయం, పూర్తిగా విద్యార్థి చేతుల్లో ఉండే సమయాలను అంచనా వేసుకోవాలి.

సమయ ప్రణాళికలో శారీరక విశ్రాంతి, మానసికంగా సేదతీరడానికి (రిలాక్సేషన్), స్నానాలు, భోజనం తదితర కార్యకలాపాలకు తగిన సమయం కేటాయించుకోవాలి. వీటికి తక్కువ సమయం కేటాయించుకోవడం వల్ల రోజుకు ఒకటి, రెండు గంటలు కలిసొచ్చినట్టు అనిపించినా చివరకు అది ఒత్తిడికే దారి తీస్తుంది.

సమయ ప్రణాళిక తర్వాతి అంచె- పాఠ్యాంశ ప్రణాళిక. అందుబాటులో ఉన్న సమయాన్ని వివిధ సబ్జెక్టులకు విభజించుకుని కేటాయించుకోవాలి. అందులో కొత్తపాఠాలు నేర్చుకొనేందుకు, పాతపాఠాల పునశ్చరణకు, రాత పనికి, చదివేందుకు, చూడకుండా రాసి చూసుకొనేందుకు సరైన సమయాన్ని కేటాయించుకోవాలి.

## ఖాళీ సమయాలు ఉంచుకోవాలి

ప్రణాళిక లక్ష్యం ఒత్తిడినీ, ఆందోళననూ జయించడం. ప్రణాళిక పేరుతో అనవసర ఒత్తిడి పెరగకూడదంటే ప్రణాళికలోని అనుకోని అవాంతరాలకు తగిన సమయం ఉంచుకోవాలి. వారంలో ఒక పూట, నెలలో మూడు రోజుల ఖాళీ వదిలేయాలి. అనుకోని కారణాలవల్ల ప్రణాళిక ఆచరణలో మిగిలిపోయిన లక్ష్యాలను ఆ ఖాళీల్లో పూర్తి చేయవచ్చు. ఒకవేళ అన్నీ అనుకున్నట్లే పూర్తయితే సేదతీరుతూ మిమ్మల్ని మీరు అభినందించుకోవచ్చు.

## నమూనా ప్రణాళిక

**(ఉదయం 5 గంటల నుంచి... రాత్రి 10 గంటల వరకు)**
**అందుబాటులో ఉన్న సమయంలో చదువుకు కేటాయించే సమయం 12 గంటలు.**
**అందులో కళాశాలలో గడిపే సమయం 7 గం. (ఉదయం 10 నుంచి సాయత్రం 5 వరకూ)**

| | | |
|---|---|---|
| ఉదయం | 5 గం. నుంచి | 6 గం. వరకు నిన్న చదివిన అంశాల పునశ్చరణ |
| ఉదయం | 6 గం. నుంచి | 6:30 గం. వరకు కాలకృత్యాలు |
| ఉదయం | 6:30 గం. నుంచి | 8:30 గం. వరకు లెక్కలు లేదా ఆంగ్ల వ్యాకరణం లేదా మీకు క్లిష్టమైన ఇతర పాఠ్యాంశం |
| ఉదయం | 8:30 గం. | అల్పాహారం |
| ఉదయం | 9 గం. నుంచి | 9:30 గం. వరకు (కళాశాలకు ప్రయాణ సమయాన్ని బట్టి) ఏదైనా తేలిక సబ్జెక్టు |
| ఉదయం | 9:30 గం. నుంచి | 10 గం. వరకు కళాశాలకు ప్రయాణం |
| సాయంత్రం | 5 గం. నుంచి | 5:30 గం. వరకు ఇంటికి ప్రయాణం, అల్పాహారం |
| సాయంత్రం | 5:30 గం. నుంచి | 6:30 గం. ఆటలు లేదా కంటికి శ్రమ కలిగించని ఇతర పద్ధతుల్లో సేదతీరడం |
| సాయంత్రం | 6:30 గం. నుంచి | 7 గం. స్నానం మొదలైనవి |
| | 7 గం. నుంచి | 8:30 గం. వరకు రికార్డులు లేదా ఇతర రాతపనులు పూర్తిచేయడం |
| | 8:30 గం. నుంచి | 9 గం. రాత్రి భోజనం |
| | 9 గం. నుంచి | 10 గం. వరకు కొత్త పాఠ్యాంశం (ఆ రోజు తరగతిలో చెప్పింది చదువుకోవడం) |

## అనుకరణ సరికాదు

రోజులో అనుకూలమైన, క్లిష్టమైన, కాస్త తక్కువ చురుకుగా ఉండే సమయాన్ని తేల్చిన సబ్జెక్టులకు కేటాయించుకోవాలి. ఈ విషయంలో అనుకూలతలను అధ్యాపకులతో చర్చించి వారి అనుమతి తీసుకోవాలి. ఒకరికి అనుకూలమైనది ఇతరులకు కాకపోవచ్చు. అలాగే, ఒకరికి కష్టమైన సబ్జెక్టు అందరికీ అంత కష్టం కాకపోచ్చు. కాబట్టి అనుకూలతలు, బలాబలాలను బట్టి సామూహిక ప్రణాళికను ఆచరణకు అనుకూలంగా అనువర్తింపజేసుకున్నప్పుడే హాయిగా దాన్ని అమలు చేయగలుగుతారు. లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. ఎక్కువ మార్కులు తెచ్చుకుంటున్న వారి ప్రణాళికలను అడిగి, చూసి తెలుసుకోవడం మంచిదే కానీ, వాటిని యథాతథంగా అనుసరించడం మంచిది కాదు. ఎవరి ప్రణాళిక వారికే సొంతం. అది మర్చిపోకండి.

# నోటీస్ బోర్డు

**ప్రభుత్వ ఉద్యోగాలు**

**ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్**

పోస్టు: షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత.

వయసు: 45 సంవత్సరాలకు మించకూడదు.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేది: 28.12.2017

వెబ్‌సైట్: http://www.amcsscentry.gov.in/

**ఈసీఐఎల్, హైదరాబాద్**

పోస్టు: గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రెయినీ

ఖాళీల సంఖ్య: 66

అర్హత: 65శాతం మార్కులతో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.

వయసు: 25 సంవత్సరాలకు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేది: 22.12.2017

వెబ్‌సైట్: www.ecil.co.in

**వాక్ ఇన్ ఇంటర్వ్యూ**

**భోపాల్ మెమోరియల్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్**

పోస్టు: జూనియర్ రెసిడెంట్, సీనియర్ రెసిడెంట్ తదితర పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్/ ఎంఎస్/ ఎండీ/ డీఎన్‌బీ/ డీఎం/ ఎంసీహెచ్.

వయసు: 33 సంవత్సరాలకు మించకూడదు.

ఇంటర్వ్యూ తేది: 2017 డిసెంబరు 18, 19

వెబ్‌సైట్: http://www.bmhrc.org/jobs.htm

**ప్రవేశాలు**

**ఐఐటీ దిల్లీ**

కోర్సు: ఎంబీఏ

అర్హత: 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. క్యాట్ - 2017లో అర్హత సాధించి ఉండాలి.

ఎంపిక: గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేది: 29.01.2018

వెబ్‌సైట్: http://www.iitd.ac.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.

**ఇంగ్లిష్ PHRASAL VERBS**

# Brush up.. జ్ఞానం పెంపొందించుకో!



**ఇంగ్లిష్ రాతలో, సంభాషణల్లో Phrasal verbs ను ఉపయోగించడం వల్ల భాష సహజంగా ఉంటుంది. కొన్నింటిని ఉదాహరణల సాయంతో నేర్చుకుందాం!**

**Gautham:** I am afraid your knowledge is not up to date. You'd (you had) better be in touch with the latest developments in the subject (నీ జ్ఞానం ప్రస్తుత పరిస్థితులకు సరిపోవడం లేదని నా అనుమానం. సబ్జెక్టులో అత్యాధునికమైన అభివృద్ధి నీకు తెలీడం మంచిది).

**Sankar:** So do I feel too. I don't know how to be abreast of the latest developments in the subject (నాకూ అదే అనిపిస్తోంది. ఈ విషయంలో అత్యాధునిక ప్రగతిని ఎలా తెలుసుకోవాలనేది నాకు తెలీడం లేదు).



ఎం. సురేశన్

**Gautham:** You'd better brush up your knowledge of the subject. Otherwise getting a job will be very difficult for you (కాలానుగుణంగా నువ్వు నీ విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి. లేదంటే నీకు ఉద్యోగం తెచ్చుకోవడం చాలా కష్టమైపోతుంది).

**Sankar:** I will start right from today. I will go to the library and get the latest books on the subject (ఈరోజు నుంచే ప్రారంభిస్తా. గ్రంథాలయానికి వెళ్లి ఈ విషయం మీద సరికొత్త పుస్తకాలను తెచ్చుకుంటా).

**Gautham:** That is what you should do to keep up with what is going on now (ఇప్పుడు జరుగుతున్న విషయాలను తెలుసుకోవాలంటే నువ్వు చేయాల్సిన పని అదే).

**Sankar:** I approached Sudheer to help me in the matter. But for reasons best known to him, he would not talk to me (నేనీ విషయంలో సుధీర్ సాయాన్ని కోరాను. కానీ తన సొంత కారణాల వల్ల నాతో మాట్లాడలేదు).

**Gautham:** Don't you just worry. My brother told me off, when I was bad at my subject. That spurred me on to study it thoroughly. My brother appreciates me now (ఏం బాధపడకు. నాకు నా సబ్జెక్టు తెలియనప్పుడు మా అన్న తిట్టాడు. అదే నన్ను ఆ సబ్జెక్టును క్షుణ్ణంగా చదవడానికి ప్రోత్సహించింది. మా అన్న నన్నిపుడు మెచ్చుకుంటున్నాడు).

**Sankar:** Of late I have started eating more than I should, and that is making me drowsy. I should cut back, gird up my loins and study seriously (ఈ మధ్య నేను తినాల్సినదానికంటే ఎక్కువే తింటున్నాను, దాంతో నాకు మత్తువస్తోంది. నేను తినడం తగ్గించుకుని, నడుం బిగించి బాగా చదవాలి).

**Gautham:** Yea, that is a good resolve. Wish you all success (అది మంచి నిర్ణయం. నీకు జయమవ్వాలని నా కోరిక).

## Now let us look at the phrasal verbs in detail

**1. To be abreast of** = to be in touch with the latest developments in a subject (ఒక విషయంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవడం).

**a) Sumanth:** The doctor I went to yesterday was useless. He does not know the latest developments in his subject (నిన్న నేను వెళ్లిన డాక్టర్ వల్ల ఏం ఉపయోగం లేదు. వైద్యంలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు ఆయనకు తెలీదు).

**Srinidhi:** Doctors should keep abreast of the latest in the subject. Otherwise they become useless, and do more harm to the patients than good (వైద్యులు వైద్యరంగంలో నేడు జరుగుతున్న మార్పులను తెలుసుకుని ఉండాలి. లేదంటే వాళ్ల వల్ల ప్రయోజనం లేకపోగా, రోగులకు మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుంది).

**b) Viswa:** Dr. Sriram is eminent in his field. There is not a thing in his subject he does not know (డా. శ్రీరామ్ తన రంగంలో చాలా నిష్ణాతుడు. ఆయనకు తన సబ్జెక్టు విషయంలో తెలియనిదే లేదు).

**Eswar:** He is an eminent professor. He keeps himself abreast of whatever happens newly in his subject. There isn't a thing he doesn't know (ఆయన తన సబ్జెక్టులో గొప్ప పండితుడు. తన రంగంలో కొత్తగా జరిగే పరిణామాలన్నింటినీ తెలుసుకుంటుంటాడు. ఆయనకు తెలియని విషయమే లేదు).



**2. To brush up** = Improve one's knowledge (జ్ఞానాన్ని పెంపొందించుకోవడం)

**a) Prabhakar:** You must know what is happening now in your subject. Otherwise you won't be fit for any job (నీ సబ్జెక్టులో ఏం జరుగుతోందో నువ్వు తెలుసుకోవాలి. లేకపోతే నీకు ఏ ఉద్యోగమూ రాదు).

**Naresh:** I am doing my best. I am going to the library every day and brushing up my knowledge (నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నా. రోజూ గ్రంథాలయానికెళ్లి నా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నా).

**b) Prakash:** How can he make it to the job? He does not know the latest information. He never reads the newspaper (అతనికెలా ఉద్యోగం వస్తుంది? కొత్త సమాచారం అతనికి తెలీదు. వార్తాపత్రికలు అస్సలు చదవడు).

**Vinai:** He has to constantly brush up on current affairs. He can't get a job otherwise (ప్రస్తుత సంఘటనలను గురించిన సమాచారాన్ని తెలుసుకోవాలి. లేకపోతే అతనికి ఉద్యోగం రాదు).

**3) Spur somebody on** = Encourage someone (ఒకరిని ప్రోత్సహించడం).

**a) Sitaram:** Our friend Prabhakar has become quite serious about his work. His juniors excelled him in the work, and he feels ashamed of it (మన స్నేహితుడు ప్రభాకర్ తన పని విషయం చాలా శ్రద్ధగా తెలుసుకుంటాడు. అతనికన్నా తక్కువ శ్రేణిలో ఉన్నవాళ్లు అతన్ని అధిగమించడంతో తాను చాలా సిగ్గు పడుతున్నాడు).

**Lakshman:** They spurred him on to learn whatever is new (ఆ తక్కువ శ్రేణి వాళ్ల ప్రతిభే అతన్ని కొత్త విషయాలను నేర్చుకునేలా పురిగొల్పింది).